ఘనంగా రామలింగేశ్వరుడి రథోత్సవం



మేడ్చల్: మేడ్చల్‌లోని దాక్షాయని రామలింగేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. స్వామివారి రథోత్సవాన్ని సోమవారం ఘనంగా నిర్వహించారు. అందంగా ముస్తాబు చేసిన రథాన్ని స్వామి వారి ఆలయం నుంచి రథశాల వరకు భక్తులు లాగారు. రథంలో స్వామి వారి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. వారం రోజుల పాటు కొనసాగే జాతరలో వేలది మంది పాల్గొని స్వామి వారి దర్శనం చేసుకుంటారు. జాతర సందర్భంగా ఆలయ రోడ్డులో వివిధ రకాల వస్తువులను విక్రయించే దుకాణాలు, స్టాల్స్ వెలిశాయి. ఆలయం వద్ద వివిధ సంఘాల నేతలు అన్నదానం నిర్వహించారు.

నూతన్‌కల్‌లో మల్లన్న కల్యాణం



నూతన్‌కల్‌లో మల్లన్న కల్యాణాన్ని వీక్షిస్తున్న ఎమ్మెల్యే మల్లారెడ్డి

మేడ్చల్: మండలంలోని నూతన్‌కల్ గ్రామంలో మల్లన్న స్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. గ్రామంలోని మల్లన్న ఆలయంలో జాతర ఉత్సవాలు, కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. అధిక సంఖ్యలో గ్రామస్తులు పాల్గొని బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు సురేష్‌రెడ్డి, భాస్కర్ యాదవ్, బలరాంరెడ్డి, జీవన్, యూనుస్ పాషా తదితరులు పాల్గొన్నారు.

పేకాట ఆడుతున్న వ్యక్తులు అరెస్ట్

పోచారం: పేకాట ఆడుతున్న వ్యక్తులను పోచారం పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. అన్నోజిగూడలోని నవ్యా గ్రాండ్ ఓయో హోటల్ వద్ద ఘట్‌కేసర్ ప్రాంతానికి చెందిన ఎనిమిది మంది పేకాట ఆడుతుండగా పోచారం ఐటీ కారిడార్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆటలో డబ్బు చేతులు మారడంతో కేసు నమోదు చేశారు. పోలీసులు అదుపులోకి తీసుకున్న వారిలో మహ్మద్ అబ్బాస్(37), గుండు సురేష్(25), తూరుపునూరి కిషన్(29), మామిండ్ల వెంకటేష్(38), గుండ్ల సిద్ధార్థ(35), మొలుగు సంతోష్(31), ముధుగని మాధవ్(27), నిర్వాహకుడు గోపి ఉన్నారు. వీరి వద్ద లభించిన రూ.27,600 నగదు, ఏడు సెల్ ఫోన్లు, 3 సెట్ల కార్డులను స్వాధీనం చేసుకున్నారు.

3.5 కేజీల గంజాయి పట్టివేత



గంజాయితో పట్టుబడ్డ నిందితుడితో మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు

మేడ్చల్: మేడ్చల్ ఎక్సైజ్ పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా 3.5 కేజీల గంజాయిని పోలీసులు పట్టుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపారు. మేడ్చల్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ నవనీత తెలిపిన వివరాల ప్రకారం ఒడిశా రాష్ట్రం మలకన్‌గిరి జిల్లా పులిమెట్లకు చెందిన సమర్ సర్కార్ అనే వ్యక్తి మూడున్నర కిలోల గంజాయితో పట్టుబడ్డాడు. అతడు కొన్ని నెలలుగా మల్కన్‌గిరి నుంచి గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్నాడని తెలిపారు. గంజాయి స్వాధీనం చేసుకుని సర్కార్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

మేడ్చల్ జిల్లా ప్రెస్‌క్లబ్ నూతన కమిటీ ఎన్నిక

సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్ – మల్కాజిగిరి జిల్లా ప్రెస్‌క్లబ్ నూతన అధ్యక్షుడిగా కల్లెపల్లి రవిచంద్ర, కార్యదర్శిగా పాక రవీందర్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. తూముకుంట మున్సిపాలిటీ పరిధిలోని ఉప్పర్‌పల్లి జిల్లా ప్రెస్‌క్లబ్ కార్యాలయం జనరల్ బాడీ సమావేశంలో సోమవారం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సమావేశానికి మేడ్చల్ జిల్లా ప్రెస్‌క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోల వెంకటేశ్వర్లు అధ్యక్షత వహించారు. నూతనంగా ఏర్పడిన జిల్లా ప్రెస్‌క్లబ్ కోశాధికారిగా దేశం కృష్ణగౌడ్, ఉపాధ్యక్షుడిగా పన్నాల బాల్‌రెడ్డి, రవికిరణ్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా పి.రామకృష్ణ, రేణుయాదవ్, కార్యవర్గ సభ్యులుగా రామారావు, శ్రీరాములు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు, ప్రెస్‌క్లబ్ కార్యవర్గ సభ్యులు ఎం.వెంకట్‌రెడ్డి, టి.మలక్కయ్య, రచ్చ శ్రీనివాస్ పాల్గొన్నారు. అనంతరం ఇళ్ల స్థలాల సబ్ కమిటీ చైర్మన్‌గా సీనియర్ జర్నలిస్టు టి.మల్కయ్య, జిల్లా ప్రెస్‌క్లబ్ గౌరవ సలహాదారుడిగా కోల వెంకటేశ్వర్లును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

స్కూళ్లకు ట్యాబ్‌లు

ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి కేంద్రం మెరుగైన విద్యావసతులు

- రెండు విడతల్లో ఎంపికైన 25 బడులకు రూ.2.70 కోట్ల నిధులు
- అభివృద్ధి కార్యక్రమాలు.. వసతుల కల్పనకు రూ.2.55 కోట్లు
- ఒక్కో పాఠశాలకు 10 ట్యాబ్‌లు అందించేలా విద్యాశాఖ ఏర్పాట్లు
- పీఎంశ్రీ కింద మూడో విడత బడుల ఎంపికపై కసరత్తు



ప్రభుత్వ స్కూళ్లను బలోపేతం చేయడంతో పాటు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో కేంద్రం 2020లో ప్రవేశపెట్టిన పీఎంశ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా) పథకం కింద ఎంపికైన పాఠశాలలకు ట్యాబ్‌లు అందించాలని నిర్ణయించారు. ప్రభుత్వ పాఠశాలల్లో సాంకేతికతను ఉపయోగించి విద్యార్థులు చదువులను ఉన్నతంగా కొనసాగించేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో కంప్యూటర్ బోధనను ఎంపిక చేసిన వాటిలో అమలు చేస్తున్నారు.

– సాక్షి, సిటీబ్యూరో

పీఎంశ్రీ పథకం కింద జిల్లాలో ఎంపికైన ఒక్కో పాఠశాలకు 25 ట్యాబ్‌లు అందిస్తున్నారు. ఇప్పటికే కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో దృశ్య బోధన అమలవుతోంది. మన ఊరు మన బడి పథకం కింద రెండేళ్ల క్రితం జిల్లాలో ఎంపిక చేసిన పాఠశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్(ఐఎఫ్‌పి)లను ప్రభుత్వం సమకూర్చింది. అధునాతన సాంకేతికత ఉపయోగించుకుని తెరపై పాఠాలను ఉపాధ్యాయులు బోధిస్తున్నారు. ఆ అంశాలను నేరుగా ట్యాబ్‌లో చూసుకునేలా, సాధన చేసేలా ఉండేందుకు విద్యార్థులకు వాటిని సమకూర్చనున్నారు. 8, 9, 10 తరగతుల విద్యార్థులకు ట్యాబ్‌ల ద్వారా పాఠాలు బోధించి, సందేహాలను నివృత్తి చేయనున్నారు.

ట్యాబ్‌లు అందించి బోధన సాగించేలా..

జిల్లాలో పీఎంశ్రీ పథకం కింద 25 పాఠశాలలను ఎంపిక చేయగా.. ఇందులో మూడు ప్రాథమిక పాఠశాలలు ఉండగా, 22 హైస్కూళ్లు ఉన్నాయి. పీఎంశ్రీ కింద మొదటి విడతలో 16 ప్రభుత్వ పాఠశాలలు ఎంపిక కాగా, రెండో విడత 10 పాఠశాలలను ఎంపిక చేశారు. ప్రస్తుతం ఈ 25 పాఠశాలల్లో విద్యార్థులకు ట్యాబ్‌లు అందించి బోధన సాగించేలా ఏర్పాటు చేస్తున్నారు. ఉన్నతాధికారుల నుంచి ఆదేశాలు రాగానే ట్యాబ్‌లను పంపిణీ చేస్తామని, వీటితో బోధన సులువు అవుతుందని విద్యార్థులు ప్రత్యేకాంశాలను సులువుగా అర్థం చేసుకోవచ్చని విద్యాధికారులు పేర్కొంటున్నారు.

- పీఎంశ్రీ కింద మూడో విడత పాఠశాలల ఎంపికపై కసరత్తు జరుగోంది. వచ్చే విద్యాసంవత్సరం ప్రారంభం నాటికి పాఠశాలలను ఎంపిక చేసేందుకు జిల్లా విద్యాశాఖ యంత్రాంగం చర్యలు తీసుకుంటోంది. ప్లే గ్రౌండ్ విశాలంగా ఉండటంతో పాటు తరగతి గదులు(క్లాస్ రూమ్స్) తదితర వసతుల ఆధారంగా పీఎం శ్రీ కింద పాఠశాలల ఎంపిక కొనసాగుతోంది. పీఎం శ్రీ కింద పాఠశాలల ఎంపికపై విద్యాశాఖ ప్రత్యేకమైన పోర్టల్‌ను రూపొందించింది. జిల్లాలో విశాలమైన ఆట స్థలం, తరగతి గదులు ఉన్న పాఠశాలలు.. విద్యాశాఖ రూపొందించిన ప్రత్యేక పోర్టల్‌లో సమాచారాన్ని అప్‌లోడ్ చేయాల్సి ఉంటోంది. అయితే ఎంపిక చేయాల్సి విద్యాధికారులు పోర్టల్‌లో సూచించిన విధంగా సంబంధిత పాఠశాలలో క్రీడా మైదానం, విశాలమైన తరగతి గదులు ఉన్నాయా.. లేదా వెరిఫికేషన్‌తో పీఎంశ్రీ కింద పాఠశాలలను ఎంపిక చేస్తున్నారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ఎంపికైన 25 పాఠశాలలు కూడా అదే విధానంతో చేపట్టినట్లు విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి.

నిధులు ఖర్చు ఇలా..

మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడంతో పాటు మెరుగైన విద్యా సౌకర్యాలు కల్పించే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 2020లో ప్రవేశపెట్టిన పీఎం శ్రీ (ప్రధానమంత్రి స్కూల్ ఫర్ రైసింగ్ ఇండియా) పథకం కింద రెండు విడతల్లో ఎంపికైన ప్రభుత్వ పాఠశాలలకు మొత్తంగా నిధులు రూ.2,70,71,637 విడుదల కాగా, ఇప్పటి వరకు పాఠశాలల అభివృద్ధి, సౌకర్యాల కల్పనకు రూ.2,55,66,611 ఖర్చు చేసినట్లు జిల్లా విద్యాశాఖ వర్గాలు పేర్కొంటున్నాయి. ఇంకా రూ.23,05,026 నిధులు నిల్వ ఉన్నాయి.

పీఎంశ్రీ కింద ఎంపికైన పాఠశాలలు ఇవే..

జిల్లాలో పీఎంశ్రీ కింద ఎంపికైన జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాలలు 23 ఉండగా, ఇందులో జవహర్‌నగర్, ఘట్‌కేసర్(బాలురు), నిజాంపేట్, గౌడవెల్లి, బోడుప్పల్, దమ్మాయిగూడ, చీర్యాల, దుండిగల్, బాచుపల్లి, డబుల్‌పూర్, గుండ్లపోచంపల్లి, కొంపెల్లి, బౌరంపేట దూలపల్లి, నాగారం, మేడిపల్లి, తుర్కపల్లి, తూముకుంట, నాగోల్, ప్రతాపసింగారం, కొర్రెముల, లక్ష్మాపూర్ పాఠశాలలు ఉన్నాయి. అలాగే, ప్రాథమిక పాఠశాలల్లో అత్వెల్లి, కమలానగర్, ఎల్ఎన్‌కాలనీ పాఠశాలలు ఉన్నాయి.

పారామౌంట్ ఎవెన్యూ అసోసియేషన్ ఎన్నికలు



కీసర: నాగారం మున్సిపాలిటీ శిల్పానగర్‌లోని పారామౌంట్ ఎవెన్యూ అపార్ట్‌మెంట్‌లో నిర్వహించిన అసోషియేషన్ ఎన్నికల్లో పారామౌంట్ వెల్ఫేర్ అసోసియేషన్ అత్యధిక మెజార్టీతో పారామౌంట్ డెవలప్‌మెంట్ కమిటీపై గెలుపొందారు. అధ్యక్షుడిగా కొట్టె మనోహర్, కార్యదర్శిగా గుడివాడ త్రినాథరావు, కోశాధికారిగా హరిసాయికృష్ణ, జాయింట్ సెక్రటరీ జయచంద్ర, కార్యనిర్వాహక సభ్యురాలు వరలక్ష్మీరెడ్డి, కార్యనిర్వాహక సభ్యుడుగా శ్రీనివాసరావు, ప్రసాద్, శ్రీనాథ్‌కశ్యప్ ఎన్నికయ్యారు. నూతన కమిటీని నాగారం మున్సిపల్ మాజీ కౌన్సిలర్ కొకుట్ల అనంతరెడ్డి అభినందించారు.

ఘనంగా మల్లన్న కల్యాణం



మేడ్చల్ రూరల్, శామీర్‌పేట్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ మైసమ్మగూడ, మూడు చింతలపల్లి మండలం అనంతారం గ్రామాలలో కొలువైన మల్లన్న స్వామి కల్యాణోత్సవాన్ని సోమవారం వైభవంగా నిర్వహించారు. గ్రామాల్లో మల్లన్న ఆలయంలో జాతర ఉత్సవాలు, కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే మల్లారెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు, వివిధ పార్టీల నాయకులు పూజలు నిర్వహించారు.

సమస్యలు పరిష్కరించాలని కమిషనర్‌కు వినతి



కమిషనర్‌కు వినతి అందజేస్తున్న జంగయ్యయాదవ్, ముత్యాలుయాదవ్

ఘట్‌కేసర్: మున్సిపాలిటీలో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు ముత్యాలుయాదవ్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు జంగయ్యయాదవ్ ఆధ్వర్యంలో కమిషనర్ చంద్రశేఖర్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. మిషన్ భగీరథ నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, సరిపోకపోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయని, నీటి నిల్వలు పెంచడానికి మున్సిపాలిటీ పరిధిలో ఉన్న బోరు మోటార్లకు మరమ్మతులు చేయించాలని, కొత్త బోర్లు వేయించాలని లేఖలో కోరారు. అన్ని ప్రాంతాలను ఎప్పుడూ శుభ్రంగా ఉంచాలన్నారు. దోమల నివారణకు ఫాగింగ్ చేయించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మున్సిపల్ ప్రధాన కార్యదర్శి రాధాకృష్ణముదిరాజ్, ఉపాధ్యక్షుడు నాగరాజుముదిరాజ్, డీసీసీ కార్యదర్శి ఆంజనేయులుయాదవ్, మాజీ సర్పంచ్ వెంకటేశ్‌ముదిరాజ్, మాజీ కౌన్సిలర్ మల్లేశ్, ఎఫ్ఎస్‌సీఎస్ మాజీ డైరెక్టర్ ప్రభాకర్‌రెడ్డి, చిత్తారి యాదవ్, యూత్ కాంగ్రెస్ మున్సిపల్ అధ్యక్షుడు సంజీవరెడ్డి, సిరాజ్ పాల్గొన్నారు.

వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సీసీ పనులు



ఎదులాబాద్‌లో సీసీ పనులు ప్రారంభిస్తున్న మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: ఎదులాబాద్ అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులకు వైఎస్సార్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం సీసీ పనులు చేపట్టారు. ఈ సందర్భంగా ట్రస్ట్ వ్యవస్థాపకుడు, మాజీ ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ యువజన సంఘం సభ్యులు ఫంక్షన్ హాల్ నిర్మించడం అభినందనీయం అన్నారు. కార్యక్రమంలో పవన్‌రెడ్డి, సురేశ్, నరేందర్‌రెడ్డి, కిశోర్, అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కంప్యూటర్ సెక్యూరిటీపై నేషనల్ కాన్ఫరెన్స్



సదస్సులో బ్రోచర్లు ఆవిష్కరిస్తున్న అధ్యాపక బృందం

మేడ్చల్ రూరల్: కండ్లకోయలోని సీఎంఆర్ టెక్నికల్ క్యాంపస్‌లో కంప్యూటర్ సెక్యూరిటీపై నేషనల్ కాన్ఫరెన్స్ నిర్వహించారు. జేఎన్‌టీయూ ప్రొఫెసర్ కామాక్షి ప్రసాద్ సదస్సును ప్రారంభించి సూచనలు చేశారు. కంప్యూటర్ సెక్యూరిటీ, ఇమేజ్ ప్రాసెసింగ్, గ్రాఫిక్స్ మొబిలిటి, అనాలిటిక్స్ వంటి వాటిపై అవగాహన కల్పించారు. సదస్సులో సీఎంఆర్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, డైరెక్టర్ రాజిరెడ్డి, డీన్ ప్రుజన్‌రాజు, హెచ్‌ఓడీలు నరేష్‌కుమార్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

జీతాలు చెల్లించాలని పారిశుద్ధ్య కార్మికుల ధర్నా



జీతాలు చెల్లించాలని ధర్నా చేస్తున్న పారిశుద్ధ్య కార్మికులు

కీసర: నాలుగు నెలలుగా రావాల్సిన జీతాలను చెల్లించాలని డిమాండ్ చేస్తూ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులు, దమ్మాయిగూడ మున్సిపల్, నాగారం మున్సిపల్ కార్యాలయాల వద్ద సోమవారం ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా పారిశుద్ధ్య కార్మికులు మాట్లాడుతూ నాలుగు నెలలుగా జీతాలు రాకపోవడంతో ఇబ్బందులు పడాల్సి వస్తోందన్నారు. ప్రతినెలా నిత్యావసర వస్తువులు కొనుగోలు చేసుకోవాలంటే అప్పులు చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారుల దృష్టికి సమస్యను తీసుకెళ్తే జీతాల కోసం ఉన్నతాధికారులకు నివేదిక పంపామని, ఆదేశాలు రాగానే జీతాలు చెల్లిస్తామంటున్నారని, మున్సిపల్ ఉన్నతాధికారులు స్పందించి పెండింగ్ జీతాలను చెల్లించాలని కోరారు. ఈనెల 13వ తేదీలోపు జీతాలు చెల్లించకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. 17న కలెక్టరేట్ వద్ద నిరసన చేపడతామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ నాగమణికి వినతి పత్రం అందజేశారు. శివబాబు, యాదయ్య, నరసింహ, బాలయ్య, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

తూంకుంటలో ప్రత్యేకాధికారి పర్యటన



సీఐఎస్ఎఫ్ క్యాంపస్‌లో మొక్కలు నాటుతున్న అధికారులు

శామీర్‌పేట్: తూంకుంట మున్సిపాలిటీలో మున్సిపల్ ప్రత్యేక అధికారి సంధ్య సోమవారం పర్యటించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల కోసం ఇచ్చిన రాయితీని పట్టణ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వేసవిలో తాగునీటి సమస్య తలెత్తకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అధికారులతో కలిసి సీఐఎస్ఎఫ్ క్యాంపస్‌లో మొక్కలు నాటారు. పర్యటనలో మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్, డిప్యూటీ ఈఈ సునీత, ఆర్ఓ అర్షద్, ఆర్ఐలు భాస్కర్, రేణుక పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో దీక్ష



కీసరలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో కొనసాగుతున్న దీక్ష

కీసర: అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించేంత వరకు నోటిఫికేషన్ల ఫలితాలను నిలిపివేయాలన్న మంద కృష్ణమాదిగ పిలుపుమేరకు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మంచాల మహేందర్ అధ్యక్షతన కీసరలో సోమవారం దీక్ష నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన జాతీయ కళా మండలి అధ్యక్షుడు అశోక్‌మాదిగ, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు పంగ ప్రణయ్ మాదిగ తదితరులు మాట్లాడారు. వర్గీకరణ అమలు చేయకుండా డీఎస్సీ ఉద్యోగాలు భర్తీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి మాదిగలను మోసం చేశాడన్నారు. నేతలు రాంచందర్, తిప్పారపు లక్ష్మణ్, జగన్‌మాదిగ, రామారం సుజాత, కర్రె గణేష్, తుడుం శ్రీనివాస్, మంచాల పెంటయ్య, నాగయపల్లి సుజాత, బాలరాజ్, శీలం మల్లేష్, రవి, భాస్కర్, లక్ష్మణ్, శ్రీశైలం, రఘు తదితరులు పాల్గొన్నారు.

వాటర్ స్పోర్ట్స్ అకాడమీలో అడ్మిషన్లకు దరఖాస్తులు

సాక్షి, సిటీబ్యూరో: గిరిజన సంక్షేమ మేడ్చల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా 2025–26 విద్యా సంవత్సరానికి బాలబాలికల కోసం బోయిన్‌పల్లిలో వాటర్ స్పోర్ట్స్ అకాడమి ప్రారంభించినట్లు ఆ శాఖ జిల్లా అధికారి ఎ.వినోద్ కుమార్ తెలిపారు. కాయాకింగ్, కెనోయింగ్, సెయిలింగ్ మొదలైన వాటర్ స్పోర్ట్స్‌లో గిరిజన బాలబాలికలకు శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. ఈ పాఠశాలలో 5వ తరగతిలో ప్రవేశం కోసం విద్యార్థుల ఎత్తు, బరువు, జంప్, వర్టికల్ జంప్, మెడిసిన్ బాల్ త్రో 30మీటర్లు, ఫ్లయింగ్ స్టార్ట్, ఫ్లెక్సిబిలిటీ టెస్ట్ 800మీటర్లు, పరుగు పందెం పోటీలు నిర్వహించి, ప్రతిభ ఆధారంగా 5వ తరగతిలో ఇంగ్లిష్ మీడియంలో 10 మంది బాలికలు, 10 మంది బాలురకు ప్రవేశాలు కల్పిస్తామన్నారు. ఈ వాటర్ స్పోర్ట్స్ పాఠశాలలో శిక్షణ పొందే గిరిజన బాలబాలికలకు ప్రత్యేకమైన ఆహారం, వసతి, స్పోర్ట్స్ దుస్తులు, షూస్‌తో సహా ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. ఆసక్తి కలిగిన బాలబాలికలు ఆగస్టు 31 నాటికి 9 నుంచి 11 సంవత్సరాలలోపు వయసు కలిగి ఉండటంతో పాటు 4వ తరగతి చదువుతున్న బాలబాలికలై ఉండాలన్నారు. రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, బోనఫైడ్, ఆధార్ కార్డు జిరాక్స్ సర్టిఫికెట్లతో ఈ నెల 15 వరకు మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా గిరిజన అభివృద్ధి కార్యాలయంలో నిర్ణీత నమూనాలో దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

గ్రాండ్ పేరెంట్స్‌డే



మల్కాజిగిరి: మల్కాజిగిరిలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో గ్రాండ్ పేరేంట్స్‌డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రాండ్ పేరెంట్స్‌కు వివిధ ఆటల పోటీలు నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. కరస్పాండెంట్ మంచాల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయులు హారిక తదితరులున్నారు.

రోడ్లు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టారని ఫిర్యాదు

పోచారం: చౌదరిగూడలోని శ్రీవెంకటేశ్వర కాలనీలో రోడ్డుతో పాటు కొంతమేరకు పార్కు స్థలాన్ని ఆక్రమించి ఇంటి నిర్మాణం చేపడుతున్నారని కమిషనర్ వీరారెడ్డికి ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని కాలనీ సంక్షేమ సంఘ ప్రతినిధులు తెలిపారు. ఇదే సమస్యపై ఇప్పటికే రెండుసార్లు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశామన్నారు. అయినప్పటికీ కబ్జా కొనసాగుతోందని ఆరోపించారు. సుమారు మూడు అడుగుల వెడల్పుతో పార్కు స్థలాన్ని కబ్జా చేసి ఇళ్లు నిర్మిస్తున్నారని చెప్పారు. కమిషనర్‌కు ఫిర్యాదుతో పాటు నిర్మాణం జరుగుతున్న ఇంటి ఫొటోలు, లేఅవుట్ నకలు అందజేశామన్నారు. ప్రజాప్రయోజనాల కోసం కేటాయించిన స్థలం కబ్జాకు గురవుతుంటే పోచారం మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

యంనంపేట్‌లో సీసీ రోడ్డు, డ్రైనేజీల ఆక్రమణపై ఫిర్యాదు..

పోచారం మున్సిపాలిటీ పరిధిలోని యంనంపేట్‌లో సీసీ రోడ్లు, డ్రైనేజీ స్థలాలను ఆక్రమించి నిర్మాణాలు జరుగుతున్నాయని ఆ ప్రాంతానికి చెందిన పోలగోని మధుసూదన్ జిల్లా కలెక్టర్‌కు సోమవారం ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఇదే సమస్యపై ఇప్పటికే రెండుసార్లు మున్సిపల్ అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందన కరువైందని, అందుకే ప్రజావాణిలో ఫిర్యాదు చేశామని మధుసూదన్ చెప్పారు. రోడ్లు ఆక్రమణకు గురవడంతో అత్యవసర సమయంలో అంబులెన్స్ రాలేకపోతోందని ఫిర్యాదులో పేర్కొన్నారు. తన ఇంటి పక్కనే రోడ్డును కబ్జా చేసి బస్వయ్య, అతడి కుమారులు వేణు, విజయ్‌కుమార్ ఇంటి నిర్మాణం చేస్తున్నట్లు చెప్పారు. చర్యలు తీసుకోకపోవడంలో ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. అధికారులు స్పందించి రోడ్డు, డ్రైనేజీ స్థలాల ఆక్రమణలను అడ్డుకోవాలని విజ్ఞప్తి చేశారు.

ప్రజావాణిలో 55 ఫిర్యాదులు

- అక్రమాలు, సంక్షేమ పథకాలపై దరఖాస్తులు
- వేతనాలపై పంచాయతీ కార్మికులు
- సర్వే చేసిన డబ్బుల కోసం సిబ్బంది మొర



సాక్షి, సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయం సమావేశపు హాల్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్(రెవెన్యూ) విజయేందర్‌రెడ్డికి 55 ఫిర్యాదులను అందజేశారు.

- మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలోని గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులకు 4 నెలల నుంచి ఇప్పటి వరకు జీతాలు ఇవ్వలేదని, వెంటనే ఇప్పించాలని ఫిర్యాదు చేశారు. కార్మిక నాయకుడు ఎస్.శ్రీనివాస్ అధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికులు తాము పడుతున్న కష్టాలు, బాధలను సంబంధిత అధికారులకు విన్నవించారు. తినడానికి తిండిలేక, ఇంటి అద్దె కట్టలేక, పిల్లలకు స్కూల్ ఫీజు, నిత్యావసర వస్తువులు కొనుగోలు చేయలేక ఇబ్బంది పడుతున్నామని పేర్కొన్నారు. వెంటనే బకాయిలు చెల్లించాలని కోరారు.
- సమగ్ర కుటుంబ సర్వే పూర్తి చేసిన సిబ్బందికి మూడు నెలలు పూర్తయినప్పటికీ ఇన్సెంటివ్ రాలేదని ఫిర్యాదు చేశారు. సమగ్ర కుటుంబ సర్వేను సెలవు రోజులు, పనిగంటలతో సంబంధం లేకుండా ఉత్సాహంతో పూర్తి చేశామని పేర్కొన్నారు. సమగ్ర కుటుంబ సర్వేకు సంబంధించిన ఇన్సెంటివ్ ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున ఇవ్వాల్సి ఉందన్నారు.
- వివిధ ప్రాంతాలు, బస్తీలు, గ్రామాల నుంచి వచ్చిన పలువురు ప్రజలు సంక్షేమ పథకాలకు సంబంధించి పింఛన్లు, ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డుల కోసం ప్రజావాణిలో దరఖాస్తు చేసుకున్నారు. అక్రమ భవన నిర్మాణాలు, భూకబ్జాలు తదితర వాటిపై కూడా ప్రజావాణిలో సంబంధిత అధికారులు స్థానికులు ఫిర్యాదు అందజేశారు. కార్యక్రమంలో డీఆర్ఓ హరిప్రియ, లా ఆఫీసర్ చంద్రావతి, డీఆర్‌డీఏ సాంబశివరావు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి మాట్లాడుతూ వివిధ శాఖల్లో ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ప్రజావాణిలో ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు తక్షణమే పరిష్కరించాలని ఆదేశించారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ సమస్యలను పరిష్కరించాలని అధికారులకు సూచించారు.